## 12. కందుకూరి వీరేశలింగం పంతులుగారు- రాజశేఖర చరిత్ర

నవ్యాంధ్ర సాహిత్య ప్రక్రియలకన్నింటికి స్థితిని, ప్రాచుర్యాన్ని కలిగించిన సంఘ సంస్కరణ దీక్షాదక్షుడు వీరేశలింగం పంతులు గారు .వీరేశలింగం పంతులు గారు నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త.

. పంతులుగారు సాంఘిక రంగంలోనే కాక సాహిత్య రంగంలో కూడా సంస్కారాలు తీసుకువచ్చారు. వీరు ఆంగ్ల భాషను కూడా అభ్యసించడం వల్ల ఆంగ్ల సాహిత్య ప్రక్రియలన్నింటినీ పరిశీలించి వాటిని ఆంధ్ర వాఙ్మయంలోనికి ప్రవేశపెట్టాడు.

వీరేశలింగం గారు బాల్య దశలోనే మార్కండేయ శతకము గోపాల శతకం రచించారు. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం, రసికజన రంజనం అనే మిశ్రా ప్రబంధాన్ని రచించారు. అభాగ్యోపాఖ్యానం అనే హాస్య ప్రబంధాన్ని సంస్కార దృష్టితో రచించారు. ఇది తెలుగులో తొలి వికట కావ్యం. గద్య రంగంలో వీరు చేపట్టిన ప్రక్రియలలో నవల ,స్వీయ చరిత్ర, వ్యాసం, విమర్శశాస్త్రం మొదలైనవి ముఖ్యమైనవి.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు 16 -4 -1848 న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. గోల్డ్ స్మిత్ రచించిన వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నవలని నమూనాగా తీసుకొని **రాజశేఖర చరిత్రము** రచించడానికి ఉపక్రమించారు. దీనిలో కథ గోదావరీ తీర ప్రాంతంలోని బ్రాహ్మణ కుటుంబాల జీవితానికి సంబంధించినది. ఆ నాటి సాంఘిక పరిస్థితులు, ఆ పరిస్థితులను సృష్టిస్తున్న పాత్రలు మొదలైన అంశాలను వీరేశలింగం గారు చిత్రించిన పద్ధతి నేపథ్యానికి కథకు కథా వస్తువు కి ఉన్న సంబంధాలు నిరూపించింది.

**రాజశేఖర చరిత్ర:**

ఆడపిల్లలకు అక్షరజ్ఞానం ఉండకూడదు. భూత వైద్యులు బ్రతకాలి. అనే సాంఘిక దురాచారాలు అన్నింటిని వీరేశలింగంగారు ఈ నవలలో చిత్రించారు. ఈ నవలలో నాయకుడు రాజశేఖరుడు. బంధువులు అంటే మహాప్రీతి .రాజశేఖరుడికి బైరాగులంటే భక్తిశ్రద్ధలు . ఎవరేం చెప్పినా వినడం ఆయన బలహీనత. బైరాగిని

విశ్వసించి బంగారం మీద ఆశతో మొత్తం బంగారాన్ని పోగొట్టుకున్నాడు.

సంపన్నుడుగా జీవించిన రాజశేఖరుడు దరిద్ర్యాన్ని భరించలేక, లంకంత ఇంటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో కాశీ యాత్రకు బయలుదేరాడు. మధ్యలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నాడు. జీవితమే అతడికి పాఠశాల అయ్యింది. అనుభవాలు గుణపాఠాలయ్యాయి. చివరకు రాజా కృష్ణ జగపతి దయ వలన సమస్యలు తొలగిపోయాయి.

వీరేశలింగం పంతులు గారు తాము ఆశించిన సంఘసంస్కరణను ఈ రాజశేఖరుడి పాత్ర ద్వారా నిరూపించారు. “ రాజశేఖర చరిత్రము” తెలుగులోని నవలా సాహిత్యంలో పరిపూర్ణ లక్షణాలతో వెలువడిన ప్రథమ సాంఘిక నవల.

ఈ విధంగా తెలుగులో సంఘసంస్కరణ కవిత్వానికి, నవల మొదలైన వచన ప్రక్రియలకు ప్రారంభకుడిగా, కందుకూరి వీరేశలింగం పంతులు గారు ఆధునిక సాహిత్య యుగకర్త గా పేరుగాంచారు.